# అడవి

మైనంపాటి భాస్కర్



ఎలెక్షన్ల వేడితో కాలేజీ ఉడికిపోతోంది.

“నీ ఓటు నాకే వెయ్యి! తెలిసిందా?” అంటూ అప్పడితో చెయ్యి కలిపాడు రాజా.



# త్వరలో కొత్త సీరియల్!

## రాచకొండ విశ్వనాథశాస్త్రి

# ఏడో చంద్రుడు

'సరే' అన్నట్లు బెదురుగా తలాడించాడు అప్పడు. అప్పడు అన్నంత "తప్పడు" పేరు గలవాడినీ, తన క్లాసులోనే చదువుతున్నా తన క్లాసుకి చెందనివాడినీ కూడా ఓటుకోసం దేబిరించాల్సి వచ్చినందుకు తల కొట్టేసినట్లుంది రాజాకి. ఇలాంటి వెధవలందరికీ కూడా ఓటెందుకు? పైగా ఈ అప్పడు షెడ్యూల్డ్ ట్రైబ్ వాడుట! అంటే గిరిజనుడు! దారి తప్పి అడవిలో నుంచి నగరంలోకి వచ్చిన లేడిపిల్లలా బిత్తర చూపులు చూస్తుంటాడు.

అప్పడి చెయ్యి విడిచేసి, ముందుకు జరిగి లెక్కల మేష్టారి అబ్బాయి సుబ్బారావు చెయ్యి అందుకున్నాడు రాజా.

"ఈ అప్పడుగాడికి పుట్టగోచీ పెట్టి, చేతిలో బరిసె పెడితేనే బాగుంటాడు గురూ. పాంటూ షర్టూ వీడికి బొత్తిగా సూటవలేదు!" అని నవ్వుతూ రహస్యంగా అని, "నీ ఓటు నాకే! ఓకే?" అన్నాడు చమత్కారంగా. అతను ఒక్కోసారి చమత్కారంగా మరోసారి ధిక్కారంగా, ఇంకోసారి కారం కారంగా మాట్లాడగలడు. నోరు గలవాడతను. ఆ నోటికి దమ్ముగా నోట్లు ఉంటాయతని దగ్గర. వాళ్ళనాన్న అదేదో ఊరికి సర్పంచ్. పంచ కట్టుకున్న సర్పంలా ఉంటాడని ప్రతీతి. మాటలతోనే కాటు వేస్తాడుట. ఆయన కొడుకైన రాజా ఇప్పుడిప్పుడే బుసకొట్టడం నేర్చుకుంటున్నాడు.

రాజా మాటలకి మొహమాటంగా నవ్వి, తల ఊపాడు సుబ్బారావు.

సుబ్బారావుని వదిలి మరో స్టూడెంటు దగ్గరి కెళ్ళాడు రాజా. "ఈ దబ్బారేకుల సుబ్బారావుగాడిదేముంది గానీ. జనార్దన్! ధనాధన్‌మని మీ ఓట్లన్నీ నాకే పడాలి! సరేనా?" అంటూ చెప్పడం మొదలెట్టాడు.

ఆ సంవత్సరం ఎన్నికలు చాలా భీభత్సమైన టెంపోలో జరిగాయి. రాజా ఒక్కడే పదివేలు ఖర్చు పెట్టాడని చెప్పుకున్నారు. "తాజ్‌మహల్ అందానికి, రాజా మీసేవకు" అన్న స్లోగన్‌తో కరపత్రాలు పంచి పెట్టాడు. ఆ కరపత్రాలమీద గాంధిగారి బొమ్మకూడా వేయించాడు. ఆ తర్వాత తన ప్రత్యర్థిని చాకుతో పొడిచి గాంధి హాస్పిటల్లో వేయించాడు.

ఎలెక్షన్లో రాజానే గెలిచాడని వేరే చెప్పనక్కర్లేదు. "నోరు, నోటూ రెండూ ఉన్నచో ఓటు వచ్చును" అన్న నీతి సూక్తి అప్పుడతనికి మొదటిసారిగా అనుభవంలోకి వచ్చింది. ఆ తర్వాత రెండేళ్ళపాటు కాలేజీని ఇష్టారాజ్యంగా ఏలాడు రాజా.

ఇంటర్మీడియెట్ పూర్తికాగానే పుస్తకాల పురుగైనసుబ్బారావుకి ఇంజినీరింగ్‌లో సీటు వచ్చింది.

"రబ్బి రబ్బి ఇంజినీరింగ్‌లో చేరినా నువ్వేంసంపాదించగలవురాసుబ్బిగారాజాలా బతకాలంటే రాజకీయం బెస్టు! మీరందరూ ఇంజనీరింగ్‌లూ, మెడిసిన్లూచదివి నాకంటే ఏం పొడిచేస్తారో చూస్తా!" అన్నాడు రాజా- అకారణంగా వైరం పెట్టుకుంటూ. అతను ఫెయిలయ్యాడు.

అనుకోని ఈ దాడికి తెల్లబోయాడు సుబ్బారావు.

కానీ ఇంజనీరింగ్ కాలేజీలో తనతో బాటు రాజా కూడా చేరినప్పుడు మరింత తెల్లబోయాడతడు.

సర్పంచ్‌గారు పంచె ఎగదోసి, ఫెయిలయిన తన కొడుకుని మేలయిన మార్కులతో పాస్ చేయించడమే కాకుండా, ఇంజనీరింగ్‌లో చేర్పించగలిగారనీ. ఈ తెర వెనక భాగోతంలో "డబ్బు" 'ఉత్తమ పాత్రధారిణి' ప్రైజు కొట్టేసిందనీ, ఆ తర్వాత తర్వాత తెలిసింది సుబ్బారావుకి. కొడుకుని పెళ్ళిళ్ళ మార్కెట్‌లో అమ్మి, కట్నం రూపేణా ఇప్పుడు ఖర్చుపెట్టిన డబ్బుకి పదింతలు గుంజవచ్చనే దిలాసాతోనే సర్పంచ్‌గారు అంత శ్రమపడ్డారని కూడా తెలిసింది.

మళ్ళీ ఓ వెలుగు వెలిగాడు రాజా.

కానీ అప్పుడు ఏమయిపోయాడో ఎవరికీ అంతుబట్టలేదు. హఠాత్తుగా అదృశ్యమైపోయాడు అతను.

ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉండగానే చదువుమానేశాడు రాజా. అప్పటిదాకా అతను తండ్రికి భయపడి, లేజీగా కాలేజీకి వస్తుండేవాడు.

సర్పంచ్‌గారు టపాకట్టెయ్యగానే, "ఇంక ఆస్తి వ్యవహారాలు చూసుకోవాలి బ్రదర్!" అంటూ కాలేజీకి గుడ్‌బై కొట్టేసి, "చూస్కో నారాజా చూస్కో!" అన్న లెవల్లో ఆస్తిని "చూసుకోవడం" మొదలెట్టాడు రాజా. జార్ చక్రవర్తిలా 'బతికాడు కొన్నాళ్ళు. క్రమంగా "జారాగ్రేసర చక్రవర్తి" అన్న కీర్తి వచ్చింది రాజాకి. హాఫ్ బాటిల్ నీట్‌గా తాగి, తూలకుండా, ఎవర్నీ తూలనాడకుండా ఇంటికి చేరగల, చేవగల మొనగాడని ప్రతిష్ఠ వచ్చేసింది. ఒకానొక సమయంలో అతనికి రెండొందల జతల బట్టలూ, యాభై జతల పాదరక్షలూ ఉండేవని విడ్డూరంగా చెప్పుకున్నారు జనం.

చిచ్చుబుడ్డిలా వెలిగిపోయిన రాజా, అంత

త్వరగానూ ఆరిపోయాడు. ఆస్తి మొత్తం కరిగిపోయింది.

ఈలోగా సుబ్బారావు ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకొని, పొట్ట పోసుకునేందుకు ఉద్యోగం దొరక్క, చిన్న వర్క్‌షాపొకటి తెరిచాడు.

ఆ సంగతి తెలిసి, "వర్క్‌షాపు పెట్టాడా! వీడి బుద్ధి అంతకు మించి ఎదగదు! ఉత్త జంతువు!" అని ఈసడించుకున్నాడు రాజా.

చూడ్డానికి నిజంగానే వింత జంతువులా ఉంటాడు సుబ్బారావు. దట్టమైన కనుబొమ్మలతో అతని మొహం చింపాంజీలా ఉంటుంది. కోతిపిల్లకుండే యుక్తి, ఒంగోలు గిత్తకుండే శక్తి, గాడిదకి ఉండేంత ఓపికా అతనిలో ఉన్నాయి. చీమలాంటి కష్టజీవి అతను. "శ్రామికుడు" అన్న పదానికి బతికి ఉన్న ఉదాహరణలా ఉంటాడు. గ్రీజు అంటిన తోళ్ళలాంటి బట్టలేసుకుని, డొక్కు సైకిలెక్కి తన ఇంటికీ, వర్క్‌షాప్‌కి మధ్య ఆసులో కండెలా తిరుగుతూ ఉండేవాడు.

"వీడు జంతువని పొరబడ్డాను! ఛీ ఛీ! వీడు అంతకంటే హీనం! యంత్రాలమధ్య పనిచేసి వీడు ఓ యంత్రమైపోయాడు!" అని వ్యాఖ్యానించాడు రాజా.

యంత్రంలాగే పని చేసేవాడు సుబ్బారావు. అర్ధరాత్రి వరకూ వర్క్ జరుగుతూనే ఉండేది అతని వర్క్‌షాపులో. మొదట్లో సెకెండ్ హాండ్ సైకిల్ మీద తిరిగిన సుబ్బారావు సంవత్సరం తిరక్కుండానే సెకెండ్‌హాండ్ మోటార్ సైకిల్ కొన్నాడు. దాని టైర్లు అరక్కుండానే సెకెండ్ హాండ్ కారు కొన్నాడు.

అంచెలంచెలుగా పైకెళ్ళిపోవడం అంటే ఏమిటో సుబ్బారావుని చూస్తే అర్థమైపోతుంది. అతనికి తన వర్కూ, వర్క్‌షాపూ తప్ప వేరే ధ్యాస లేదు. "ఈ సుబ్బారావుకి లక్ష్మిని తెచ్చిన వర్క్‌షాప్ నా మొదటి లవర్! నా భార్య సుబ్బలక్ష్మి నా రెండో లవర్ మాత్రమే!" అని ఒక రోజు భార్యతో జోక్ చేశాడు సుబ్బారావు.

ఆ జోకు వినగానే ఆమెకి దోకు వచ్చింది. అంటే అతని జోకు అంత దరిద్రంగా ఉందని కాదు అర్థం. అమ్మాయికి నెల తప్పింది. వేవిళ్ళు.

కొంచెం కుదటబడిన తర్వాత గారంగా అడిగింది సుబ్బలక్ష్మి. "హాయిగా ఇల్లు గడిచిపోయేందుకు సరిపోయేటంత సంపాదిస్తున్నారు. ఇంకా ఎందుకండీ రాత్రింబగళ్ళు హైరాణ పడిపోవడం!" అని.

"ఉహూం! అలా కాదు లక్ష్మీ! ఇంకా కష్టపడి పని చెయ్యాలి! పెద్ద ఫ్యాక్టరీ పెట్టాల్యాలి! మనం పుష్కలంగా సంపాదించుకోవడంతో పాటు పదిమందికి ఉద్యోగం చూపించాలి. బీదరికాన్ని నడ్డిమీద తన్ని పారద్రోలెయ్యాలి! వీలైతే దేశాన్ని నాలుగడుగులు ముందుకు లాక్కెళ్ళిపోవాలి!" అన్నాడు సుబ్బారావు ఆవేశంగా.

అనడంతో ఊరుకోలేదు. ఫ్యాక్టరీ పెట్టడానికి అనువైన స్థలం కోసం గాలింపు మొదలెట్టాడు. ఊరవతల ఉన్న రెండెకరాల బంజరు భూమి ఫ్యాక్టరీకి బాగా సూటవుతుందని తోచి వాకబు చేస్తే, అది రాజాది అని తెలిసింది. ఆ స్థలం తప్ప రాజాకి మరేమీ మిగలలేదని, ఆస్తి అంతా తగలేశాడని కూడా చెప్పారెవరో.

"ఈ స్థలం నాకు అమ్ముతావా రాజా?" అని అడిగినప్పుడు రాజా ఎగిరి గంతేసి, సుబ్బారావుని కావలించుకున్నంత పని చేశాడు. "ఇంతటి శుభవార్త చెప్పినందుకు నిన్ను విస్కీలో ముంచేస్తాను పద!" అన్నాడు సంతోషంగా.

సుబ్బారావుకి విస్కీ నేకాక, బీరు కూడా అలవాటులేదని తెలిసినప్పుడు వెక్కిరింపుగా నవ్వాడు రాజా.

"బీరుకూడా తాక్కుండా ఓరువాలనిండా దాస్తున్నావా డబ్బు! డబ్బు వెనకెయ్యడమే తప్ప నువ్వు ముందుకి పోవడం లేదన్నమాట!" అన్నాడు ఎకసెక్కెంగా.

ముప్పై వేలకి బేరం కుదిరింది. నెట్ క్యాష్ ఇచ్చేశాడు సుబ్బారావు. ఆ ముప్పయ్ వేలనీ ముప్పయ్ రోజుల్లో ఆర్పేశాడు రాజా. పక్షపాతం లేకుండా ఆ డబ్బుని రేసులకీ రేసుగుర్రంలాంటి అమ్మాయి రోసీకీ, 'రోసీ అండ్ మార్టినీ' అనే విదేశీ మద్యానికీ సమంగా పంచిపెట్టాడు.

స్థలం కొనగానే ఫ్యాక్టరీ నిర్మాణానికి చురుగ్గా ప్రయత్నాలు మొదలెట్టాడు సుబ్బారావు. లైసెన్సు కోసం నాన్సెన్సూ, న్యూసెన్సూ అనిపించే అనవసరమైన బోలెడు ఫారమ్సూ, ఫార్మాలిటీసూ పూర్తి చేశాడు. ఇంక షెడ్లు కట్టించాలి. మెషినరీ కొనాలి, లేబర్నీ, స్టాఫ్నీ ఏర్పాటు చేసుకోవాలి.

అప్పుడు మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు అప్పుడు. చేతిలో కాన్వాస్ బ్యాగ్ ఉంది. దీనంగా కనబడుతున్నాడు.

"రా! అప్పుడూ! రా! ఎక్కడికెళ్ళిపోయావ్ ఇన్నాళ్ళూ?" అన్నాడు సుబ్బారావు ఆప్యాయంగా.

"మా నాయనకి ముళ్ళపంది ముల్లు దిగబడి చీముపట్టి ఎన్నాళ్ళకూ తగ్గలేదని కబురొస్తే నేను గూడేనికి వెళ్ళినా. నాయనకి కాలు కొట్టేశారు. ఇన్నాళ్ళూ అక్కడే ఉండిపోవాల్సివచ్చింది" అన్నాడు అప్పుడు.

"అయ్యో! అలాగా!" అని సానుభూతి చూపించాడు సుబ్బారావు.

కొంతసేపు భారమైన నిశ్శబ్దం. తర్వాత వాతావరణాన్ని తేలిక చెయ్యడానికి




సాంప్రదాయానికి సన్నిహితం
వస్త్ర సంపదకు ఉన్నతం
కొత్తకోడళ్ళ
శ్రావణమాసపు నిండుదనానికి!
విమల్ వారి
మురిపాల......చీరెలకై!!
ఆథరైజ్డ్ విమల్ షోరూం:
ఆరాధన
VIMAL
యం.జి.రోడ్-కొత్తగూడెం.
ఫోన్ 32

అన్నాడు సుబ్బారావు. "ఏదీ? అప్పుడూ! నీ జింక చర్మం సూట్ కేసేదీ?" అన్నాడు.

"అది నెత్తిన బెట్టుకుని అడవిలో ఏరు దాటతా ఉంటే ఏరు పొంగి సూట్ కేసూ దాంతోపాటు సర్టిఫికేట్లూ కొట్టుకబాయె! సర్టిఫికేట్ల కోసం కాలేజీకెళితే రేపు రా. మాపురా అని తిప్పుతున్నారు. సర్టిఫికేట్లు లేకపోతే ఎంప్లాయ్ మెంట్ ఎక్స్చేంజిలో పేరు రిజిష్టర్ చేసుకోమన్నారు. రిజిష్టరు చేసుకోకపోతే ఉద్యోగం రాదు."

"అవును! చాలా ఇబ్బందే!"

"అన్నా! నువ్వు ఫ్యాక్టరీ పెడుతుండా వంట! నాకేదన్నా ఉద్యోగం ఇప్పించి పుణ్యం కట్టుకో! లేకపోతే తిండికి జరక్క మలమల మాడిపోతా!" అన్నాడు అప్పుడు.

"ఓ యస్! తప్పకుండా!" అన్నాడు సుబ్బారావు. "కానీ ఫ్యాక్టరీ కట్టాలంటే ఇంకా స్త టైం పడుతుందికదా! అప్పటి దాకా వర్క్ షాప్ లోనే ఏదన్నా పని నేర్చుకుంటూ ఉండు. సరేనా?"

అప్పుడు బ్రహ్మానందభరితుడయ్యాడు. ఆ రోజు నుంచీ పగలంతా వర్క్ షాప్ లోనే పనిచేసి రాత్రిళ్ళు కూడా అక్కడే నిద్రపోయేవాడు. వేరే యిల్లు అద్దెకు తీసుకునే స్తోమతలేదు అతనికి.

హడావిడిగా ఫ్యాక్టరీ ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంకో తొమ్మిది పదినెలల్లో ఫ్యాక్టరీ ఒక రూపానికొస్తుందని లెఖ్ఖ వేసుకున్నాడు సుబ్బారావు.

కానీ ఆ లెఖ్ఖని "తప్పు" అని కొట్టేస్తూ లెఖ్ఖలమేష్టారైన సుబ్బారావు తండ్రి ఆకస్మికంగా మరణించాడు. సంవత్సరం తిరక్కుండానే కన్యాదానం చేస్తే సద్గతులు లభిస్తాయని చెప్పారు బంధుజనం. అంచేత చేతనయినంతగా తిరిగి. చెల్లెలికి సంబంధం కుదిర్చి పెళ్ళి చేసేశాడు సుబ్బారావు.

ఈ కారణాలన్నిటివల్లా ఫ్యాక్టరీపని ఒక సంవత్సరం వెనకబడింది.

అతను మామూలు మూడ్ లోకివచ్చి. తన

## రాయని భాస్కరుడు

గుండె గొంతుకలో
కొట్లాడినప్పుడు
మనసు అచ్చుయంత్రం
మహా కావ్యం ముద్రిస్తుంది
వేదనా జలధిలో
ఒక్కో కెరటం విరిగిపడి
భాషకందని భావాన్ని
నిరాటంకంగా ప్రకటిస్తుంది.
ఆలోచనల్ని. ఆశల్ని
ఆవేదనల్ని. అనుభూతుల్ని
అక్షరాంకితం చేసే లోపే
భావన చెప్పాపెయ్యకుండా
పలాయనం చిత్తగిస్తుంది.
అశక్తతా, అసహాయతా
అతనితో పరుగులు తీ
స్తాయి వెక్కిరిస్తూ—

— కిరణ్ బాబు

స్థలాన్ని చూసుకోవడానికి వచ్చేసరికి. అక్కడ కనబడ్డ దృశ్యం దిగ్భ్రమ కలిగించింది.

తన స్థలంలో బోలెడంతమంది జనం గబగబ అటూ ఇటూ తిరుగుతూ ఏవేవో పనులు చేసేస్తున్నారు. రేకులూ తాటాకులూ, టార్పాలిన్ ముక్కలూ అక్కడక్కడ పడివున్నాయి. నాటికో తయారయిన పని గుడిసెలుకూడా ఉన్నాయక్కడ.

ఖద్దరు లాల్చీ, పైజమా వేసుకుని. పెరిగిన గెడ్డంతో, పేదలపాలిటి పెన్నిధిగా, పీడితప్రజానీకానికి సరికొత్త ఆశాజ్యోతిగా అవతారం దాల్చిన రాజా, అక్కడ నిలబడి అజమాయిషీ చేస్తూ, గుడిసెలు వేయిస్తున్నాడు.

"ఏమిటిది.?" అన్నాడు సుబ్బారావు బలహీనంగా.

రాజా సహనంగా నవ్వాడు.

"గుడిసెలు వేయిస్తున్నాను బ్రదర్!! గుండెలు కరిగేలా శ్రమించే కష్టజీవులకి గూడు ఏర్పరుస్తున్నాను."

"నా స్థలంలోనా?"

"పక్కా కేపిటలిస్టులా మాట్లాడకు! నీ ఫ్యాక్టరీ కంటే ముందు. తల దాచుకునే ఆశ్రయం ముఖ్యం మాలాంటి బీదవాళ్ళకి!"

రాజానా బీదవాడు!

సుబ్బారావుకి నోటమాట రాలేదు.

"కార్మికనాయకుడు రాజా-జిందాబాద్!" అని కేక లేశాడు-రాజా అనుచరుల్లోఒకడు.

వెంటనే నినాదాలు మిన్నుముట్టాయి.

"ప్రజా నాయకుడు రాజా- జిందాబాద్!

"సుబ్బారావ్— ముర్దాబాద్!" వింటూ ముసిముసిగా నవ్వాడు రాజా.

"నేను కోర్టు కెళతాను!" అన్నాడు— సుబ్బారావు. నిస్సహాయంగా మండిపడుతూ.

"తప్పకుండా వెళ్ళు!" అన్నాడు రాజా. చిద్విలాసంగా.

"ఏంటి రాజాసాబ్! ఏమంటున్నాడు ఈయన?" అంటూ వచ్చాడు సయీద్ బేగ్. అతనికి మాంసం దుకాణం వుంది. కానీ అతను మేకలకంటే మనుషుల పీకలే ఎక్కువ కోసి వుంటాడని చాలామందికి తెలుసు.

రాజా చెప్పింది విని. సుబ్బారావువైపు తిరిగాడు సయీద్ బేగ్. "ఎక్కువ తక్కువ మాట్లాడినావంటే నరికి కైమా కొడతా!" వార్నింగిచ్చాడు.

అక్కడ గుడిసెలు వెయ్యబోయే "బీద వాళ్ళు" ఎవరో సుబ్బారావుకి అర్థం అయింది.

కానీ—

సకలమైన అవలక్షణాలూ, స్వార్థ చింతనా తప్ప మరేమీ క్వాలిఫికేషన్లు లేని రాజా ప్రజా నాయకుడెలా అయ్యాడో మాత్రం అతనికి సుతరామూ అర్థంకాలేదు.

అతని మెదడు శూన్యమైపోయింది. తను కన్న కలలన్నీ తన కళ్ళముందే కల్లలయిపోతుంటే దిక్కుతోచనట్లు దిగాలుపడి నిలబడిపోయాడు సుబ్బారావు.

* * *

బాగా పొద్దుపోయాక, నిస్సత్తువగా తన వర్క్ షాప్ కి తిరిగి వచ్చిన సుబ్బారావుకి దుప్పటి పరుచుకుని నిద్రకి ఉపక్రమించబోతున్న అప్పుడు కనబడ్డాడు.

వెంటనే ఒక ఆలోచన తట్టిందతనికి. తన స్థలం రాజా ఆక్రమించుకున్నాడు.అది తనకి తిరిగిరావడం ఇంక దాదాపు అసంభవమే! కనీసం ఈ బీదవాడైన అప్పుడికి అందులో ఒక వంద గజాల స్థలం పాకికి పాకవేసుకోగలిగితే— కొంచెంలో కొంచెమయినా తనకి తృప్తి మిగులుతుంది.

ఒకసారి బాబూరాజేంద్రప్రసాద్ ఓడలో తన స్వస్థలం వెళుతున్నాడు. ఆ ఓడలో ఓ యువకుడు సిగరెట్టు తాగుతూ పొగ గొట్టంలా పొగవదిలేస్తున్నాడు. అది నచ్చని రాజేంద్రప్రసాద్- "బాబూ! నీవు నీ సిగరెట్టే కదా తాగుతూంట" అన్నాడు.



అందుకా యువకుడు యెగతాళిగా నవ్వి. "ఎందుకొచ్చింది మీకా అనుమానం. ఇది ఖచ్చితంగా నా డబ్బులతో కొన్న నాసొంత సిగరెట్టు. మరెవ్వరిదీ కాదు" అన్నాడు.

"నీదే అయితే ఆ పొగ నీలోనేవుంచుకో ఇతరులమీదికి రానీకు" అన్నాడు రాజేంద్రప్రసాద్.

—అయినాల కనకరత్నాచారి. కొరిశపాడు

"రాజా బీదవాళ్ళ కోసం ఊరవతల గుడిసెలు వేయిస్తున్నాడు. నువ్వూ వెళ్ళి ఒక పాక వేసుకో అప్పడూ!" అన్నాడు సుబ్బారావు. కొద్దిగా కంపిస్తున్న గొంతుకతో.

అమాయకుడైన అప్పడు కొండంత ఆశతో పరుగెత్తి వెళ్ళాడు:

తెల్లారిన తర్వాత ఈసురోమని కాళ్ళీడ్చుకుంటూ తిరిగివచ్చాడు.

"అక్కడ గుడిసెలు వేయిస్తోంది నాలాంటి బీదోళ్ళకోసం కాదన్నా! ఐదొందల రూపాయలు కడితేనే యాభై గజాల స్థలం ఇస్తున్నాడంట రాజా. ఇప్పటికే ఇరవై మంది కట్టేసినారంట! ఇంక లాభం లేదంట!" అన్నాడు.

"రెండు ఎకరాల్లో ఇరవై గుడిసెలేనా పట్టేది?" అన్నాడు సుబ్బారావు చిత్రంగా.

అయిదారు నెలలు గడిచాయి. మెల్లి మెల్లిగా విషయాలు బయటపడ్డాయి.

ఆ రెండు ఎకరాల్లో మచ్చుకి ఓ పాతిక గుడిసెలు మాత్రం వేయించాడుట రాజా. అప్పడులాంటి నిజమైన పేదలకు. ఐదొందలు కూడా కట్టలేని నిర్భాగ్యులకు అందులో పదిగజాల స్థలం కూడా దొరకలేదు. మిగతా స్థలమంతా ఖాళీగానే ఉండిపోయింది.

క్రమక్రమంగా గుడిసెలకి అటుపక్కా, ఇటుపక్కా 'పక్కా' కాంక్రీటు బిల్డింగులు లేచాయి. ఒక బ్రాకెట్టు దుకాణం. ఒక 'బ్రా' కట్టే అమ్మాయిల దుకాణం. ఒక క్లబ్బు— దానిలో జూదం అనే జబ్బు-వృద్ధి చెందాయి.

రాజా, అతని 'సర్కిల్'కి చెందిన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, నరభక్షకులుగా మారిన కొంతమంది రక్షక భటులూ, వారు పోషించే ఆస్థాన రౌడీలూ కలిసి, ఆ లొకాలిటీని పెద్ద అవినీతి కేంద్రంగా మార్చేశారు.

"పోన్లే అన్నా! రాజాలాంటివాళ్ళు జనాన్ని దోచుకు తింటున్నా, నీలాంటి వాళ్ళు నూటికి కోటికి ఒక్కళ్ళున్నా చాలు న్యాయం నిలబడుతుంది! నీ వర్క్‌షాపులో పని చూపించబట్టి ఏదో రెండుపూట్లా ముద్ద మింగుతున్నాం మేము" అన్నాడు అప్పడు.

అప్పడు అలా కృతజ్ఞతాపూర్వకంగా మాట్లాడుతూ వుండగానే. ఒక రిజిష్టర్డ్ లెటర్ ఇచ్చి వెళ్ళాడు పోస్ట్‌మేన్. అది ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసునుంచి కటువైన భాషలో సుబ్బారావుకి నోటీసు.

"మీ వర్క్‌షాపులో ఫలాని ఫలాని ఉద్యోగాలు వున్నాకూడా నిబంధనల మేరకు మీరు వాటిని ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజివారి దృష్టికి తీసుకురాలేదు.

స్వర్ణ కనకధార
నెలా నెలకు
రాబడినిచ్చే
కామధేనువు
MASSCOM
SWARNA SWARNA SWARNA SWARNA SWARNA
ప్రణాళిక ! కనకధార డిపాజిట్ ప్రణాళిక ప్రకారం
సాలుకు 18% వడ్డీ మీకు కోరినట్లయితే ప్రతి నెల చెల్లించబడుతుంది
వడ్డీ దరలు
6 నెలల 15%
1 సంవత్సరం 17%
2 సంవత్సరాలు 18%
3 సంవత్సరాలు 19%
ఇతర డిపాజిట్ పథకాలు
సురక్షవర్ధన క్యాష్ సర్టిఫికేట్లు
కేవలం 48 నెలల వ్యవధిలో మీ డబ్బును రెండింతలుగా పెరిగిస్తాయి
3 సంవత్సరాల వ్యవధి సర్టిఫికేట్లు
66.5% మొత్తం డబ్బుకు మీకు మరం హామీ నమ్మిక ఇవ్వగలవు
రికరింగ్ డిపాజిట్ ప్రణాళిక
మీకు మంచి రాబడినివ్వగలవు
నోటీస్ డిపాజిట్
వడ్డీ సాలుకు 14%
SECURITY SWARNA SAFETY
స్వర్ణ
ఫైనాన్స్ అండ్ ఇన్‌వెస్ట్‌మెంట్స్
గ్లామర్ థియేటర్ కాంప్లెక్స్, 66, ఎమ్. జి. రోడ్డు
బెంగళూరు-560 001 ఫోను : 570630
స్వర్ణవారి అర్హతగల ప్రణాళికలు
అధిక వివరాలకు బ్రాంచి మ్యానేజరుతో సంప్రదించండి
హైదరాబాద్ – పుష్పాంజలి కాంప్లెక్స్, 210, 2వ ఫ్లోర్, కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజ్ 500 001
ఫోన్ : 38586 విజయవాడ- 26, 28, 2, ఎస్. 3 ఎ. వి. గర్ల్స్ హైస్కూల్ ఎదుట
నాగేశ్వరరావు పంతులు రోడ్డు, గాంధీనగర్-520 003 కాకినాడ - డోర్ నెం 28-1-3 టెంపల్ స్ట్రీట్.
సత్యనారాయణ మూర్తి సెంటర్ ఎదుట, 533 001 ఫోన్ : 5237
నెల్లూరు- నెం. 16,1082, ట్రంక్ రోడ్డు. దశరథ కాంప్లెక్స్-524 001
కర్నూలు- 40.30, ఎ. పార్కు రోడ్డు ఎదుట, గాంధీనగర్-518 001 ఫోన్:1427
2వ ఫ్లోర్, కొల్లూరు బిల్డింగ్స్, సూర్యబాగ్ విశాఖపట్నం - 530 020
శాఖలు:- మద్రాసు, మదురై, ఎర్నాకులం, పాండిచేరి కల్కత్తా, న్యూఢిల్లీ
కోయంబత్తూరు, తిరువనంతపురం మంగళూరు
SWARNA SWARNA SWARNA SWARNA SWARNA SWARNA SWARNA SWARNA SWARNA

సమగ్రమైన వార్తలకు,
సముచితమైన వ్యాఖ్యలకు,
సువిశితమైన సంపాదకీయాలకు, సుందరమైన వ్యాసాలకు
ఆంధ్రజ్యోతి
దినపత్రిక చదవండి!

## బతుకు పుస్తకం ఆవిష్కరణ

ఆగస్టు 11 వ తేదీన సుప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ పుప్పాల లక్ష్మణరావుగారి 85 వ జన్మదినం సందర్భంగా ఆయన ఆత్మకథ "బతుకు పుస్తకం" ఆవిష్కరణోత్సవం బరంపురంలో వైభవంగా జరిగింది. ఆహ్వాన సంఘం తరపున శ్రీ ముండపాక కామేశ్వరరావు అతిథులను ఆహ్వానించినతరువాత, వక్తలను శ్రీ మల్లాప్రగడ రామారావు, లక్ష్మణరావుగారిని శ్రీ తాతిరాజు సభకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సాహిత్య పత్రిక 'స్పృహ' లక్ష్మణరావుగారిపై వెలువరించిన ప్రత్యేక సంచికను శ్రీ రమేష్‌రాజు ఆయనకు అందజేశారు. బరంపురం ప్రజల తరపున శ్రీ విజయచంద్ర అభినందన పత్రం సమర్పించారు. లక్ష్మణరావుగారి సతీమణి కీర్తిశేషురాలు మెల్లీ షోలింగర్ స్మృతుల సంకలనం "మా మెల్లీ"ని కార్యనిర్వాహక సంఘం ద్వారా రచయితకు సమర్పించారు. అనంతరం "బతుకు పుస్తకం" ఆవిష్కరణ జరిగింది. సభికుల

## సమాచారమ్

హర్షధ్వానాల మధ్య తనకు జరిగిన యీ సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుతూ డాక్టర్ లక్ష్మణరావు ప్రసంగించారు. శ్రీమతి ఓల్గా, శ్రీ చేకూరి రామారావు ప్రసంగాల అనంతరం శ్రీ ఎమ్. రామారావు కృతజ్ఞతలతో సభ ముగిసింది.

## ఆంధ్ర నాటక కళాసమితి

విజయవాడకు చెందిన యీ సంస్థ అక్టోబర్ 7, 8, 9 తేదీలలో భరతనాట్యం, కూచిపూడి, జానపదరీతులలో నిర్వహించనున్న పోటీకి ప్రవేశపత్రాలు సెప్టెంబరు 16లోగా చేరాలి. గెలుపొందిన జూనియర్ల (9-15 సంవత్సరాల మధ్యవయస్సులు)కు వరుసగా రు. 316, రు. 216, రు. 116; సీనియర్ల (16-25 మధ్యవయసు కలవారు)కు వరుసగా రు. 516, రు. 316, రు. 116 నగదు బహుమతులు, షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేస్తారు. వివరాలకు, ప్రవేశ పత్రాలకు శ్రీ బచ్చు రామచంద్రరావు,) కన్వీనర్, ఆంధ్ర నాటక కళాసమితి, 11-25 .33-. మెయిన్ బజార్, విజయవాడ—1 ను సంప్రదించవచ్చు.

మాకు నోటీసైనా పెయ్యకుండానే లేక్క అప్పుడు మొదలుగాగల కొంతమందిని మీ వర్క్‌షాపులో నియమించినట్లు తెలియవచ్చింది. ఫలాని రూలు, ఫలాని సెక్షను కింద, మిమ్మల్ని ఎందుకు ప్రాసిక్యూట్ చేసి చర్య తీసుకోరాదో సంజాయిషీ ఇవ్వవలసిందిగా కోరడమైనది."

"ఛా!" అని ఉమ్మేశాడు అప్పడు కసిగా. "అమ్మ పెట్టా పెట్టదు, అడుక్కు తినానివ్వదు అన్నట్టుంది అన్నా ఇది! గవర్నమెంటు పెట్టిన రూల్సు మనకి సాయంగా వుండాలేగానీ, ఆ రూల్సే రూళ్ళకర్రల్లా మనకాళ్ళు విరగ్గొట్టి ముందుకు పోనీయకుండా అడ్డంపడకూడదు. సర్టిఫికేట్లు ఇమ్మంటే కాలేజీవాళ్ళు ఇవ్వరు! అవి లేకుండా ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజి వాళ్ళు రిజిష్టర్ చేసుకోరు! రిజిష్టర్ చేసుకోకుండా ఉద్యోగం రాదు! ఎవరైనా ఉద్యోగం ఇచ్చినా అది నేరం! బాగుందన్నా ఇది చాలా బాగుంది! ఉద్యోగాలు ఇప్పించడంకోసం పెట్టిన ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజి నిజానికి సైంధవుడిలా మారి ప్రతి ఉద్యోగానికీ అడ్డం నిలుస్తోంది!" అంటూ చకచక తన సామాన్లన్నీ కాన్వాస్ బ్యాగ్‌లో కుక్కెయ్యడం మొదలెట్టాడు.

"ఎక్కడికి వెళుతున్నావ్ అప్పడూ?" అన్నాడు సుబ్బారావు నిస్పృహగా.

"నేను మా గూడేనికి వెళ్ళిపోతానన్నా! సిటీకంటే సీకటి అడవే నయం! ఇక్కడున్నంత అయోమయం, అన్యాయం అడవిలో కూడా లేదన్నా! మనుషులకంటే జంతువులే మెరుగు! అక్కడా చిరతలూ, పెద్దపులులూ తమకోసం కొంతస్థలం ఆక్రమించుకుంటూనే ఉంటాయి. అయితే అవి తమకి కావలసినంత స్థలం మాత్రమే ఆక్రమించుకుంటాయన్నా! ఇక్కడో! రాజాలాంటివాళ్ళు ఊరంతా తామే ఆక్రమించుకోవాలని చూస్తుంటారు."

కళ్ళార్పకుండా అప్పడినే చూస్తున్నాడు సుబ్బారావు.

అల్లూరి సీతారామరాజు మళ్ళీ పుట్టినట్లు అదోరకమైన తేజస్సు కనబడుతోంది అప్పడిలో. అన్నీ అర్థంచేసుకున్న జ్ఞానిలా ఉన్నాడతను.

"అడవిలో జంతువులు ఆకలేస్తే అది తీరడానికి సరిపోయేంత ఆహారమే తింటాయి అన్నా! అంతేగానీ ఆకలిగా ఉందని అడవంతా మేసెయ్యదు జింక! ఆకలిగా ఉందని అడవిలో ఉన్న జంతువులనన్నిటినీ చంపెయ్యదు పులి! నిజానికి జంతువుల్లో ఉన్నంత న్యాయం మనుషుల్లో లేదన్నా!"

విశ్మలంగా చూస్తున్నాడు సుబ్బారావు.

## 'ఖ'ఖ

తెలుగుతల్లి తేనెమోవి
విరిసిన దరహాసరేఖ – ఈ విశాఖ

సాగర గంభీర హృదయ
జనిత కళా చంద్రరేఖ
శారద వీణానిక్వణ
వినదిత సానురేఖ– ఈ విశాఖ

జలధి మృదంగ నాదానికి
పురి విప్పిన కవితాశిఖ
ప్రతి లేఖిని తూర్పు రేఖ
అరుణారుణ మయూఖ – ఈ విశాఖ

వైశాఖ మదన చాపానికి
తాళలేని యువలోకం
కదలి ఒదివి రాసుకొన్న
ప్రణయలేఖ – ఈ విశాఖ

ఎత్తుపల్లపు బాటలు
పల్లవెరుగని పాటలు
కార్మిక శక్తుల నెత్తిన
జయపతాక– ఈ విశాఖ,

('ఖ' అంటే ఆకాశం, స్వర్గం అని అర్థాలు.)

—'పైడిపాల'

"పైగా ఇంకో సంగతి తెలుసా అన్నా. పులిని దాని గబ్బునిబట్టి, దానిమీద ఉన్న చారలని బట్టి గుర్తుపట్టి మన జాగ్రత్తలో మనం ఉండొచ్చు. ఇక్కడలా కాదు! పులులు మేక వన్నెతో, మేలురకం సెంటు పూసుకుని మనతో పూసుకు పూసుకు తిరుగుతుంటాయి.

అందుకని అడవే బెటరు సుబ్బారావన్నా! అక్కడా దారికడ్డంగా పిచ్చితీగెలూ, ముళ్ళ దొంకలూ ఉంటాయిగానీ దానిలోనూ ఒక క్రమం ఉంది. కానీ ఈ కాంక్రీటు బిల్డింగుల అడవిలో అక్రమమే తప్ప క్రమం లేదు! అన్యాయమే తప్ప న్యాయం లేదు! నేను వెళ్తాను అన్నా!" అంటూ దూరమైపోయాడు అప్పడు.